# వలయువారు

సన్నగా వాన పడుతోంది.

స్టేషన్ గేట్ దాటించి వెళ్లిపోయాడు టికెట్ ఎగ్జామినర్.

సదానందం రోడ్డు మీదకు వచ్చి నిల్చున్నాడు.

టాక్సీవాళ్లు, ఆటోరిక్షావాళ్లు అతన్ని గుమిగూడారు.

-'రండి, సర్. రండి, ఎక్కడికి పోవాలో చెప్పండి...'

-'ట్వంటీ ఫైవ్ రుపీస్ చాలుసార్, గాంధీనగర్ తీసుకువెడతాను'

-'ముందు బండి ఎక్కండి, సర్. సిటీ లిమిట్స్‌లో ఎక్కడికైనా సరే!'

-'ఎయిర్‌పోర్ట్‌కు తీసుకు వెళ్లమంటారా' యస్, సర్. వందరూపాయలు చాలు.'

-ఇలా రకరకాలుగా అడుగుతున్నారు, వేధిస్తున్నారు.

సదానందం స్తబ్ధుగా నిలుచుండిపోయాడు వాళ్లమధ్య.

'నన్నేమీ బాధపెట్టకుండా మీ దారిన మీరు పోవాలంటే ఎంత యివ్వాలి?' అని ఒక్కొక్కడి గొంతు బలంగా పట్టుకుని అరిచి అడగదాలనిపించింది అతనికి. అంత కసిగా వుంది వాళ్లగోల చూస్తుంటే. కాని రగడ అవుతుందని నింపాదిగా నిలబడిపోయాడు. అతని దగ్గర్నుంచి ఎలాంటి స్పందన రాదని రూఢి చేసుకున్నాక వాళ్లందరూ ఎవరిదారిన వాళ్లు - మరో ప్రయాణికుడిని పట్టుకుని పీడించడానికి వెళ్లిపోయారు.

ఒంటరిగా మిగిలిపోయిన తరువాత సదానందం హాయిగా నిట్టూర్చాడు.

చేతిలో బ్రీఫ్‌కేస్ బరువుగా వున్నట్లు అనిపించింది.

చేయి మార్చుకుందాం అనుకున్నాడు.

తీరాచూస్తే బ్రీఫ్‌కేస్ లేనేలేదు. ఏమయింది?

క్షణం మాత్రం ఆలోచించగా గుర్తు వచ్చింది.

...నాలుగు స్టేషన్ల అవతల ఒక మనిషి రైలు దిగిపోయాడు.

పోతూపోతూ తన బ్రీఫ్‌కేస్ చేత పట్టుకువెళ్లాడు.

పొరపాటు అనుకోవటానికి వీల్లేదు, అతని బ్రీఫ్‌కేస్ యిక్కడ వదిలి వెళ్లలేదు గనుక కావాలనే చేసివుంటాడు.

పిచ్చివాడు! అబ్బ...అరగంటసేపు ఎన్నెన్ని కబుర్లు చెప్పి ఊదరగొట్టేశాడు! లోకజ్ఞానం అంతా తన సొమ్మే అయినట్లు ప్రతివిషయాన్ని గురించీ తన వాక్చాతుర్యం జోడించి చెబుతూనే వున్నాడు, అనేకంగా. అతను దిగిపోవడం తన మనస్సుకు ఎంతో హాయిగా, విశ్రాంతిగా అనిపించింది.

తీరా ఏమయింది తరువాత?

టికెట్ ఎగ్జామినర్ వచ్చాడు.

బ్రీఫ్‌కేస్ తీసి తన టిక్కెట్ ఆయనకు చూపిద్దామనే సదుద్ధేశ్యంతో పక్కకు చూసుకుంటే- ఆ వస్తువు కాస్తా మటుమాయం అయిన విషయం గమనంలోనికి వచ్చింది.

ఎగ్జామినర్ తన కథనం నమ్మలేదు. అతను నమ్మితే ఎంత, నమ్మకపోతేరీ ఎంత...అని బేషరవగా వుండటానికి వీల్లేదు.

బ్రీఫ్‌కేస్, టికెట్ మాట దేవుడెరుగును.

తన పేరు యేమిటో, ఎక్కడికి వెడుతున్నాడో కూడా గుర్తు రాలేదు, ఆ సంభ్రమంలో, ఎగ్జామినర్ ముందు తానో 'యింపోస్టర్'గానే మిగిలిపోయాడు. ఏం చెప్పినా 'యింపర్సనేషన్' అయిపోయినట్లు వుందిగాని అవతలి మనిషికి నమ్మకం కలిగించేట్లుగా లేదు- తన పరిస్థితి.

ఆఖరుకు విసుగుపుట్టి ఎగ్జామినర్ అన్నాడు: 'అయ్యా టికెట్ చూపించకుండా ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణం చేయడం ఘోరాతి ఘోరం అయిన నేరం. పైగా మీరు తగిన సమాధానం యివ్వలేకపోతున్నారు. చూసీ, చూడనట్లుగా వుండిపోదాం అంటే - ఈ రైల్లో స్పెషల్ స్క్వాడ్ వస్తున్నారు. అన్యాయంగా నా ఉద్యోగం ఊడిపోతుంది... అందుచేత పై స్టేషన్లో రైలు దిగిపొండి. ఇంకో మామూలు పెట్టెలో ఎక్కుతారో, ఊళ్ళోకే వెడతారో మీ యిష్టం... ఈ పెట్టెలో వుండటానికి మటుకు వీలు లేదు...' అనడమేగాదు అన్నంత పనీ చేశాడు.

సదానందానికి యింకొక రైలు పెట్టెలో ఎక్కడం ఉచితం- అనిపించలేదు. ఊళ్లోకి వెళ్లి చూద్దామనే అనుకున్నాడు. తీరా రోడ్డుమీదకు వచ్చాక ఎక్కడికి వెళ్లాలి? అన్న ప్రశ్న సొంతం ఎదురు పడకుండానే టాక్సీవాళ్లు, ఆటోలవాళ్లు పుండుమీద కారం చల్లారు.

రోడ్డు మీద పది అడుగులు వేసి నడవడం అయ్యేటప్పటికి వెనక నుంచి ఎవరో 'కమలాకరం అన్నయ్యా!' అని అరవడం వినవస్తోంది.

'కమలాకరం అన్నయ్య...' ఆడగొంతు.

తనపేరు కమలాకరం కాదు గనుక వెనుక్కు తిరిగి చూడలేదు.

మళ్లీ అదే పిలుపు - రెండుమార్లు వినిపించింది.

తరువాత భుజాలమీద చేయిపడి, ఆ చేయి క్రమంగా అతని చేతిని స్వాధీనం చేసుకుంది.

'పిలుస్తున్నా పలుకకుండా వెళ్లిపోతున్నవేం, అన్నయ్యా?'- అంది ఓ ఆడమనిషి

సదానందం ఆమె వంక తేరిపార చూచాడు.

ముప్పయియేళ్ల లోపు మనిషి.

'నేను...నేను...వత్సలను అన్నయ్యా నన్ను గుర్తుపట్టలేదా? అంటుంది ఆమె, యింకా చేతిపట్టు బిగించి.

'ఎవరు మీరు? నాకు తెలీదు...' గొణిగినట్లుగా అన్నాడు. ఆమె కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి.

ముఖం కాస్త పక్కకు తిప్పుకుని 'రా, కమలాకరం అన్నయా-తరువాత మాట్లాడుకుందాం-' అంటూ అతన్ని రోడ్డువారగా నిలబెట్టిన కారువైపుకు దాదాపు తీసుకుంటూ వెళ్లింది. కారులో స్థిమితంగా కూర్చున్నాక, డ్రైవింగ్ సీట్‌లో నుంచి వత్సల పక్కకు చూస్తూనే 'ఉత్తరమన్న రాయలేదేం. అన్నయ్యా, మీ బావగారు యీ ట్రైయిన్‌కు బొంబాయి వెడుతున్నారు. డ్రాప్ చేయటానికి వచ్చాను. రేపు సాయంత్రం వచ్చేస్తారు...' అంది.

ఆమెకు ఎన్నోప్రశ్నలు వున్నాయి. అవన్నీ అడిగేయాలని అమిత ఆదుర్దాగా వుంది. కాని అవతలి మనిషి ఉలకడు, పలకడు. అయినా తొందరపడకూడదు... నిదానంగా అన్నీ సరపడతాయి. ఇంటికి వచ్చాక డ్రాయింగ్ రూం వంక ఎగాదిగా చూస్తున్నాడు సదానందం.

'ఎందుకల్లా కొత్తగా చూస్తావు?, మూడేళ్లక్రితం ఎలా వుందో యిప్పుడూ అల్లాగే వుంది. ఇదుగో నువ్వు యిచ్చిన కలర్ టి.వి.; టు-ఇన్-వన్. నువ్వు ఎక్కడ పెట్టించావో అక్కడే వున్నాయి. అంగుళం మేరయినా కదపలేదు నేను-' అంది ఆమె.

కప్పు కాఫీ కడుపులోనికి వెళ్లిన తరువాత నాందిగా అడిగింది వత్సల: చెప్పు అన్నయ్యా. ఈ మూడేళ్లూ ఎక్కడ వున్నావు? ఒక్క ఉత్తరం ముక్కయినా వ్రాయలేదేం? మేమంతా యేమయిపోయినాం అనుకున్నావు? ఏమయిపోతామో తెలియదా నీకు...?

'నా పేరు కమలాకరం కాదు.'

నమ్మనట్టుగా నవ్వింది వత్సల. కానీ ఏమీ మాట్లాడలేదు.

సరే. స్నానం చేసి విశ్రాంతి తీసుకో-యీ రోజంతా.

రేపు మీ బావగారు వచ్చాక చూసుకోవచ్చు...' అని అతన్ని గెస్టురూంలో ప్రవేశ పెట్టింది.

తాను కమలాకరం కాదని చెబుతూ వున్నా, యిక్కడ నుంచి వెళ్లిపోవటానికి యేమీ ఆదుర్దా చూపించకపోవడంతో వత్సలకు ఎంతో ధైర్యం వచ్చినట్లు అయింది. ఇంకా కోపంగానే వున్నాడు... అందుకనే అలా మాట్లాడుతున్నాడు. నాలుగు రోజులు నడిచిపోతే అంతా సర్దుకుంటుంది...అని తనకు తాను చెప్పుకుంది.

మధ్యాహ్నం భోజనాల దగ్గర సాదనందం నోరు విప్పనేలేదు, తినడానికి తప్ప

వత్సల ప్రశ్నలు వేస్తూనే వుంది. అతను జవాబు చెప్పే ప్రయత్నమే చేయలేదు. ముఖకవళికల్లో ఎలాంటి హావభావాలు కనబరచలేదు. ఆమె అతని కదలికల్ని గమనిస్తూనే వుంది. మాటల్లో దొరక్కపోతేనేం... ఆ నడక, ఆ నుదురు, ఆ పెదాలు విరుచుకున్నట్లుగా వుండడం...అన్నీ కమలాకరం పోలికలే. ఏమీ అనుమానం లేదు.

ఈ మనిషి కమలాకరం కాకపోవడానికి ఒక్కటయినా కారణం ఆమెకు కనిపించలేదు. అబ్బ! మూడేళ్లు ఎంత యాతనపడ్డారు యితనికోసం! చెప్పాచేయకుండా ఎలా మాయమయ్యాడో అలాగే అకస్మాత్తుగా ఆకాశం నుంచి ఊడిపడ్డట్లు ఈ రోజు రోడ్డుమీద తేలాడు.

ఇదంతా తన అదృష్టం ఆ సమయానికి ఆ రోడ్డున కారులో వెళ్లవలసిరావడం దైవికం. కాకపోతే మరేమిటి? ఇతన్ని ఎలాగయినా మాట్లాడించేట్లు చేసి... ఓ వారం రోజుల్లో వదినకు క్షేమంగా అప్పజెప్పగలిగితే అంతకన్న తనకు ఈ జన్మలో కావలసిందేమీ లేదు అనుకుంది వత్సల వదిన ఎంత సంతోషిస్తుంది! ఆకుటుంబంలో మల్లీ పువ్వులు పూస్తాయి. కొమ్మలు, రెమ్మలు వేస్తాయి.

రాత్రి భోజనం దగ్గర 'అయినా అట్లా చెప్పకుండా ఎక్కడకు వెళ్లావు, అన్నయ్యా. నా కన్నా ఒక్క ఉత్తరం ముక్క...ఓ టెలిఫోన్ కాల్...' అంది వత్సల.

సదానందం తల ఎత్తి ఆమెవంక చూచాడు.

అదే చూపు! ఇతను నా కమలాకరం అన్నయ్యే... కాదని ఎంత చెప్పినా నేను నమ్మను గాక నమ్మను... అనుకుంది వత్సల.

అతని ముఖంలో విసుగులేదు. భయంలేదు. ఏరకమైన బాధలేదు.

నిర్వికార నిరంజనుడిలా వున్నాడు అతను.

'రమేష్ యిప్పుడు పదోక్లాసులోనికి వచ్చాడు, అన్నయ్యా, ఎరుగుదువా?' అంది వత్సల - అతనికి తెలియదని రూఢిగా తనకు తెలిసినా.

రమేష్ ఎవరు? - అన్నట్లుగా చూస్తున్నాడని ఊహించుకుని, 'నా మేనల్లుడు! నీ కొడుకు...నెక్స్ట్ ఇయర్ కాలేజికి వస్తాడు' అంది. నాకు కాలేజిలో చదువుకునే వయస్సున్న కొడుకు వున్నాడు. మరి నా వయస్సు ఎంత? - అనుకున్నాడు సదానందం.

వత్సలకు ముప్పైయేళ్లు అయితే... తను ఆమెకు అన్నయ్య అయితే... తనకు ముప్పై అయిదేళ్లు వున్నా ఆశ్చర్యంలేదు. కాని...కాని...ఈ వత్సల ఎవరు?...తనకు తెలియదు. ఏదో ఆప్యాయంగా యింటికి తీసుకువస్తే-పోనీలే...ఈ ఆడకూతురు సంతోషం పాడుచేయడం ఎందుకు...అని తను నోరుమూసుకుని కూర్చుంటున్నాడు.

ఈ వత్సల ఎవరోగాని తనకు చెల్లెన్ని అనుకుంటూంది.

ఈమెకు పిల్లలున్నారా?

అడుగుదాం...అనుకున్నాడు సదానందం. మరుక్షణంలోనే చెప్పుకున్నాడు... ఆ

విషయం తెలుసుకోవడం నాకు అవసరం అయితే ఆమే చెబుతూంది... ఎందుకు అనవసరంగా వుబలాట పడడం?...

మరునాడంతా మామూలుగానే జరిగిపోయింది.

బ్రేక్‌ఫాస్ట్.

పేపర్ రీడింగ్.

క్రాస్‌వర్డ్ పజిల్ పేజీ మడిచి తనముందు పడేసింది. వత్సల. ఓ బాల్‌పాయింట్ పెన్ కూడా యిచ్చింది. 'నీకు యిది నింపడం అలవాటు కదూ పొద్దున్నే...' అంటూ.

సదానందం క్లూస్ స్టడీ చేస్తూ కూర్చున్నాడు.

కాగితం మీద కలం మోపనేలేదు.

మధ్యాహ్నం భోజనం అయ్యాక, విశ్రాంతి సమయంలో అడిగింది.

'పోనీ ఓ సినిమా చూద్దామా? మొన్న ఓ కొత్త వీడియో పట్టుకొచ్చాను.'

'వద్దు. వద్దు' అన్నట్లుగా తల వూపాడు. ఆ చప్పుళ్ళు వినడం కంటె కళ్ళు మూసుకు పడుకోవడం మంచిదని.

నాలుగయిదు పుస్తకాలు, పత్రికలు టీపాయ్ మీద ప్రత్యేకంగా పడేసింది.

ఏ పుస్తకంలో మాత్రం కొత్త విషయాలు వుంటాయి?...జీవితపుస్తకాన్ని మించిన మహాగ్రంథం యింకేం వుంది?...అనుకున్నాడు.

ఆలోచనలు రాకపోవడం అంటూ లేదు.

ఏవో కదలబారుతూనే వున్నాయి. నాకు కావలసిన సమాచారం అందదు.

రాత్రంతా బాగా నిద్రపోయాడు.

మనసులో యెలాంటి ముడతలూ లేవు. సాపుగా యిస్త్రీ చేసి వీత్తరీయం లాగా విశాలంగా పరుచుకుని వుంది.

మూడోనాడు ఉదయం... బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ దగ్గర మరోమనిషి అగుపడ్డాడు.

వత్సల అడిగింది అతన్ని 'చూచారా...యేమండీ!...యితను ఎవరో చెప్పగలరా?'

'ఓ-కమలాకరం! ఎప్పుడు వచ్చావు? అన్నాడు అతను ఆనందంగా చేయి ముందుకు చాచుతూ.

సదానందం ఆ చేతిని నిర్లిప్తంగా అందుకుంటూనే 'నా పేరు కమలాకరం కాదు...' అన్నాడు.

'నీకు పెసరట్లంటే యింకా యిష్టమేనా?' అంది వత్సల, రెండోడిష్ అతని వైపు జరుపుతూ.

'ఇష్టం!...ఇష్టం అంటే యేమిటి?...ఆలోచన ప్రారంభం అయింది సదానందానికి.

'ఇష్టాలు మారిపోతూ వుంటాయి. తెలుసుతే...' అన్నాడు ఆ మూడోమనిషి. బహుశ వత్సల మొగుడు అయివుంటాడు... అనుకున్నాడు సదానందం. యేమీ మాట్లాడకుండానే.

ఆ సాయంత్రం వత్సల ఉత్సాహంగా కారు డ్రయివింగ్ మొదలెట్టింది.

పక్కన ఆమె భర్త కూర్చున్నాడు.

సదానందం వెనక సీట్‌లో వున్నాడు.

'బయలు దేరుదామా అన్నయ్యా...' అనడిగింది వత్సల; చేతి గడియారం ముల్లు తన అనుకున్న చోటుకు వచ్చాక.

'నీ యిష్టం-' అన్నాడు సదానందం.

- ముందురోజే వత్సల టెలిఫోన్లో చెప్పింది, వదినకు-యితన్ని తీసుకువస్తున్నట్లు.

ఇప్పుడు వాళ్లు ముగ్గురూ...

కమలాకరం భార్య, కొడుకు, తల్లి...ఎదురు చూస్తూవుంటారు. ఎంతసేపు? ఇంకోగంటలో తాము వాళ్లు ముందు వుంటారు గదా...' అనుకుంది వత్సల.

కమలాకరానికి యిదంతా చెప్పడం అనవసరం.

అతను యింటికి వెళ్లాక ఎలా స్పందిస్తాడో గూడా వత్సల ఊహించుకుంటూ కూర్చుంది డ్రైవ్ చేస్తున్నంత సేపూ.

'నేను కమలాకరం కాదు. నా పేరు నాకు గుర్తులేదు. అందుచేత నేను ఎవరో నాకు తెలీదు! అని మనసులో పదేపదే చెప్పుకుంటున్నాడు.

పైకి మాత్రం యేమీ మాట్లాడలేకపోతున్నాడు.

వాళ్లు బయలుదేరినప్పుడు కూడా సన్నగా వాన పడుతూనే వుంది.

వార్త-ఆదివారం, 1998

◆